

‘భారతి’కి తిరుగులేదు

వ్యాపార రంగంలో భారతి సిమెంట్‌కు తిరుగులేదని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహ్మద్ సాహేర్ అన్నారు. 10లో▸



నేలరాలిన మామిడి

కడ్తాల్ మండల కేంద్రంలో ఈదురు గాలులతో కూడిన వానకు మామిడి తోటల్లోని కాయలు నేల రాలాయి. 10లో▸



ప్రసవాల సంఖ్య పెంచాలి

కేశంపేట పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు సూచించారు. 10లో▸

న్యూస్‌రీల్

నేడు ‘భూ భారతి’పై అవగాహన సదస్సు

మొయినాబాద్: ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ‘భూ భారతి’పై గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గౌతమ్‌కుమార్ తెలిపారు. సురంగల్ రోడ్డులోని స్టార్ కన్వెన్షన్ హాల్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. మొయినాబాద్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని అన్ని గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఇబ్రహీంపట్నం: ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్టీసీ ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ వెంకటనర్సప్ప తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలపై గురువారం మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 4గంటల వరకు 7981745576 నంబర్‌కు ఫోన్ చేయొచ్చని సూచించారు. మరింత మెరుగైన సేవల కోసం సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

రజతోత్సవాలను జయప్రదం చేయండి



బి.సతీష్, డీసీసీబీ డైరెక్టర్

శంషాబాద్ రూరల్: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవాలను జయప్రదం చేయాలని డీసీసీబీ డైరెక్టర్ బూర్కుంట సతీష్ పార్టీ శ్రేణులు, అభిమానులకు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. అన్నివర్గాల ప్రజలతో పాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్‌ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతుబంధు, రుణమాఫీ వంటి పథకాలు అమలు చేయడంలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా గ్రామాల్లో పాలనను గాలికొదిలేశారని మండిపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో మరోసారి బీఆర్‌ఎస్ అధికారం చేపడుతుందని స్పష్టంచేశారు.

పీసీసీ అబ్జర్వర్ల నియామకం

సాక్షి, సిటీబ్యూరో: సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ జిల్లాలకు పీసీసీ అబ్జర్వర్ల (పరిశీలకులు)ను నియమించారు. ఈ మేరకు బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అబ్జర్వర్ల జాబితాను విడుదల చేశారు.

- హైదరాబాద్, సికింద్రాబాద్, ఖైరతాబాద్, మేడ్చల్– మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాలకు ఇద్దరేసి చొప్పున పీసీసీ అబ్జర్వర్లను నియమించగా, రంగారెడ్డి జిల్లాకు ముగ్గురు నేతలను నియమించారు.
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు పీసీసీ అబ్జర్వర్లుగా సీహెచ్.పారిజాతా నర్సింహారెడ్డి, కె.శివకుమార్‌లను నియమించగా, రంగారెడ్డి జిల్లాకు కె.శ్రీనివాస్‌రెడ్డి, కె.సంతోష్‌కుమార్, దారాసింగ్, వికారాబాద్‌కు ఎంఆర్‌జీ వినోద్ రెడ్డి, రాంశెట్టి నరేందర్‌లను నియమించారు.
- హైదరాబాద్ జిల్లాకు ఎస్.సురేష్‌కుమార్, పి.సుబ్రమణ్యప్రసాద్, సికింద్రాబాద్‌కు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, రాచమల్ల సిద్ధేశ్వర్, ఖైరతాబాద్‌కు ఎస్.వినోద్‌కుమార్, భీమగాని సౌజన్యగౌడ్‌లను పీసీసీ అబ్జర్వర్లుగా నియమించారు.

రేపు ద్విచక్ర వాహనాలకు వేలం

తాండూరు: ఆబ్కారీ నేరాల్లో పట్టుబడిన రెండు స్ప్లెండర్ బైక్‌లకు ఈ నెల 25న వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ శాఖ తాండూరు సీఐ బాల గంగాధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు తాండూరు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఈ వేలం ఉంటుందని చెప్పారు.

బాలకేంద్రంలో సమ్మర్ క్యాంపు

అనంతగిరి: వికారాబాద్‌లోని బాలకేంద్రంలో సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ అనురాధ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి మే 26 వరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఈ క్యాంపు కొనసాగుతుందని చెప్పారు. నృత్యం, వాయిద్యం, చిత్రలేఖనం, కుట్టు, అల్లికలు తదితర అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఉంటుందని వివరించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మిత్రులు దూరం.. సెలవులు భారం

వీఎం హోంలోనే అనాథ విద్యార్థులు • స్నేహితులు ఇళ్లకు వెళ్తుంటే చెమ్మగిల్లుతున్న కళ్లు



హుడాకాంప్లెక్స్: వార్షిక పరీక్షలు ముగిశాయి. ఎండలు భగ్గున మండుతుండటంతో ప్రభుత్వం విద్యార్థులకు వేసవి సెలవులు ప్రకటించింది. ప్రభుత్వ, ప్రైవేటు వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులను వారి తల్లిదండ్రులు వచ్చి వెంట తీసుకెళ్లారు. అయితే సరూర్‌నగర్ విక్టోరియా మెమోరియల్ అనాథాశ్రమంలో చదువుతున్న 60 మంది మాత్రం సెలవుల్లోనూ వసతి గృహానికే పరిమితం అవుతున్నారు. ఇక్కడ 800 మంది పిల్లలు చదువుతున్నారు. వీరిలో అమ్మానాన్నలిద్దరూ చనిపోయిన వారితో పాటు సింగిల్ పేరెంట్ పిల్లలు కూడా ఉంటున్నారు. పాఠశాలకు సెలవులు కావడంతో వీరంతా తమ తండ్రి/ తల్లి/ గార్డియన్ వెంట సొంతూళ్లకు వెళ్తున్నారు. అయితే ఏ ఆదరణ లేని వారు మాత్రం భారంగా అక్కడే ఉండిపోతున్నారు. ఇప్పటి వరకు తమతో ఆడుకున్న మిత్రులు నెల రోజుల పాటు దూరం కానున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అక్కను తీసుకెళ్లారు కానీ..



మాది వలిగొండ. అమ్మానాన్నలు లేరు. చిన్నప్పుడే వాళ్లు నన్ను వదిలి వెళ్లారు. ఆ తర్వాత రామన్నపేటలోని మా అమ్మమ్మ, తాతయ్యలే నన్ను చేరదీశారు. వారికి సరైన ఆర్థిక స్తోమత లేకపోవడంతో నన్ను వీఎం హోంలో చేర్చారు. అప్పుడప్పుడు వచ్చి చూసి వెళ్తుంటారు. మా అక్క శ్రవంతి కూడా ఇక్కడే చదువుకుంది. పదో తరగతి వార్షిక పరీక్షలు ముగియగానే ఆమెను వెంట తీసుకెళ్లారు. కానీ నన్ను ఇక్కడే ఉంచారు. అందరిలాగే నాకు కూడా ఇంటికి వెళ్లాలని ఉంది. అమ్మానాన్నా లేరు కానీ ఇక్కడ అన్ని వసతులు ఉన్నాయి.

– శ్రవణ్‌కుమార్, 9వ తరగతి

అమ్మానాన్నలు లేకపోవడంతో..

మాది మాల్ మండలం నేరెళ్లపల్లి. పదేళ్ల క్రితమే ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి అమ్మ చనిపోయింది. ఆ తర్వాత అనారోగ్యంతో నాన్న కూడా చనిపోయాడు. నాతో పాటు తమ్ముడు ఉదయ్ కిరణ్ కూడా ఉన్నాడు. బంధువులు ఉన్నా.. ఎవరూ దగ్గరకు తీసుకోలేదు. అప్పటి నుంచి మేము ఒంటరి అయ్యాం. అప్పుడప్పుడు మా మామయ్య వచ్చి చూసి వెళ్తాడు. అమ్మానాన్నలు లేకపోవడంతో వేసవి సెలవులు వచ్చినా.. ఇంటికి వెళ్లలేని పరిస్థితి. వీఎం హోంలోనే ఉండిపోతాం.

– రాంచరణ్, 8వ తరగతి



బాధగా ఉంది



మాది వికారాబాద్ జిల్లా జిన్నారం గ్రామం. చిన్నతనంలోనే అమ్మానాన్నలు చనిపోయారు. ఎనిమిదేళ్ల క్రితం తాత, అమ్మమ్మ నన్ను వీఎం హోంలో చేర్పించారు. వాళ్లు ఏడాదికి ఒకసారి వచ్చి చూసి వెళ్తారు. పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో మిత్రులంతా వాళ్ల సొంతూళ్లకు వెళ్తున్నారు. కానీ నేను మాత్రం గత ఎనిమిదేళ్లుగా ఇక్కడే ఒంటరిగా ఉంటున్నా. ఇప్పటి వరకు ఊరికి కూడా వెళ్ల లేదు. సొంతూరిని గుర్తుపట్టలేను. నాకు కూడా మా గ్రామానికి వెళ్లాలని ఉంది. కానీ ఏం చేస్తాం. నన్ను తీసుకెళ్లే వారు లేరు. నాకు ఎవరూ లేరనే బాధకన్నా.. ఇప్పటి వరకు తోడుగా ఉన్న మిత్రులు కూడా నన్ను వదిలి వెళ్తుంటే బాధగా ఉంది.

– వై.శ్రీశైలం, 8వ తరగతి

అనైతిక ఆస్పత్రులపై కొరడా

వరుస ఫిర్యాదులతో రంగంలోకి దిగిన వైద్యారోగ్య శాఖ



మీర్‌పేట్‌లోని హిరణ్య ఆస్పత్రిని సీజ్ చేస్తున్న వైద్యారోగ్య శాఖ అధికారులు

- అనుమతులు లేకుండా కొన్ని.. ఫేక్ సర్టిఫికెట్లతో మరికొన్ని..
- నకిలీ మెడికల్ బిల్లులతో సీఎంఆర్‌ఎఫ్‌కు టోకరా
- జిల్లాలో ఇప్పటికే పలు క్లినిక్‌లు సీజ్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎలాంటి అనుభవం, అర్హత లేకుండా క్లినిక్‌లు ఏర్పాటు చేసి, నిబంధనలకు విరుద్ధంగా పేషంట్లను చేర్చుకుని, చికిత్సలు చేస్తున్న అనైతిక వైద్యులు, ఆస్పత్రులపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కొరడా ఝుళిపిస్తోంది. ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి, ఆస్పత్రి రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసిన నార్సింగిలోని ఆరోన్ ఆస్పత్రిని అధికారులు ఇటీవల సీజ్ చేశారు. తాజాగా ఎలాంటి అనుభవం, అర్హతలేని శంకర్‌దాదా ఆర్‌ఎంపీలపైనే కాకుండా యునానీ, ఆయుర్వేద కోర్సులు పూర్తి చేసి అల్లోపతి వైద్యులుగా చలామణి అవుతున్న వారిపైనా చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే షాద్‌నగర్, హఫీజ్‌పేట, సరూర్‌నగర్‌లో పలు ఆస్పత్రులు, క్లినిక్‌లను సీజ్ చేశారు.

శంకర్‌దాదా ఆర్‌ఎంపీలపై చర్యలు

హైదరాబాద్ జిల్లాలో 286 ప్రభుత్వ, 2,298 ప్రైవేటు ఆస్పత్రులు, రంగారెడ్డి జిల్లాలో 355 ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో కొండాపూర్‌లోని జిల్లా ఆస్పత్రి, వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి సహా తొమ్మిది కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 55 ప్రైమరీ హెల్త్ సెంటర్లు, 231 సబ్ సెంటర్లు, 57 బస్తీ దవాఖానాలు ఉన్నాయి. వీటితో పాటు మరో 2,500పైగా ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో మెజార్టీ క్లినిక్స్ వనస్థలిపురం, హస్తినాపురం, సరూర్‌నగర్, బాలాపూర్, మీర్‌పేట్, హఫీజ్‌పేట్, తుర్కయంజాల్, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల, ఆమనగల్లు తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. అనుమతులు లేకుండా వీటిని నడుపుతుండటంతో తరచూ ఫిర్యాదులు వెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం మదీనాగూడలో రామకిరణ్ నడుపుతున్న కిరణ్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్, న్యూ హఫీజ్‌పేట గణేశ్ మండపం వద్ద అబ్దుల్ వాహిద్ నిర్వహిస్తున్న రెహమానియా క్లినిక్, ప్రేమ్‌నగర్‌లో ఎ.రమేష్ నడుపుతున్న శ్రీసాయి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, మార్తండనగర్‌లోని ఎం.కవిత ఫస్ట్ ఎయిడ్ సెంటర్, కొండాపూర్ గణేశ్ టెంపుల్ రోడ్డులోని పి.అర్వింద్ నడుపుతున్న శ్రీవేంకటేశ్వర క్లినిక్‌లను సీజ్ చేశారు.

చర్యలు తప్పవు

వైద్య ఆరోగ్యశాఖ నుంచి అనుమతులు పొందకుండా ఆస్పత్రులు, క్లినిక్‌లు ఏర్పాటు చేసిన నకిలీ వైద్యుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నాం. పేదలు, నిరక్షరాస్యులు ఎక్కువగా నివసించే సరూర్‌నగర్, మీర్‌పేట్, నందనవనం, తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల, ఆమనగల్లు, యాచారం, తలకొండపల్లి, మాడ్గుల, కేశంపేట్, కొందుర్గులో ఇవి ఎక్కువగా ఉన్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

ఆ కేసులో పట్టుబడిన పది..

సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తులపై అనుమానం రావడంతో 2023 సెప్టెంబర్‌లో సచివాలయ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణలో ఎనిమిది జిల్లాల్లోని 28 ఆస్పత్రులు నకిలీ బిల్లులు సృష్టించి, నిధులను కొల్లగొట్టినట్లు తేలడంతో ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. మోసాలు రుజువు కావడంతో చర్యలకు ఆదేశించింది. వీటిలో హైదరాబాద్ జిల్లాలో నాలుగు, రంగారెడ్డి జిల్లాలోని ఆరు ఆస్పత్రులు ఉన్నాయి. ఇందులో మాదన్నపేటలోని జనని ఆస్పత్రి సహా బీఎన్‌రెడ్డినగర్‌లోని శ్రీరక్ష ఆస్పత్రి, ఎల్బీనగర్‌లోని ఎంఎంస్ ఆస్ప త్రి, ఐఎస్‌సదన్‌లోని అరుణశ్రీ ఆస్పత్రి, సైదాబాద్‌లోని శ్రీకృష్ణ ఆస్పత్రి, రామంతాపూర్‌లోని ఏడీఆర్‌ఎం ఆస్పత్రి, కొత్తపేటలోని ఎంఎంవీ ఇందిరా ఆస్పత్రి, బైరమల్‌గూడలోని శ్రీసాయితిరుమల ఆస్పత్రి, హస్తినాపురంలోని డెల్టా ఆస్పత్రి, మీర్‌పేటలోని హిరణ్య ఆస్పత్రులు ఉన్నాయి. ఇప్పటికే వీటిలో పలు ఆస్పత్రులను సీజ్ చేశారు.

మళ్లీ దరఖాస్తు అక్కర్లేదు

- నెల రోజుల్లోపే భూ సమస్యకు పరిష్కారం
- భూ భారతి చట్టంతో పక్కాగా ఆస్తుల పరిరక్షణ
- కలెక్టర్ సి.నారాయణరెడ్డి
- కొత్త చట్టంపై రైతులకు అవగాహన



హయత్‌నగర్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా/బడంగ్‌పేట్: భూ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న బాధితులు మరోసారి అర్జీ పెట్టుకోవాల్సిన అవసరం లేదని కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. ‘ధరణి’ పోర్టల్‌లో పెండింగ్ జాబితాలో ఉన్న దరఖాస్తులన్నింటినీ కొత్తగా తెచ్చి ‘భూభారతి’ పోర్టల్‌లోకి బదిలీ చేశామని స్పష్టంచేశారు. ఈ మేరకు బుధవారం హయత్‌నగర్, సరూర్‌నగర్ మండలాల్లో భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్వే తర్వాతే రిజిస్ట్రేషన్

వ్యవసాయ, వాణిజ్య భూములను పక్కాగా పరిరక్షించే గొప్ప అవకాశాన్ని భూభారతి చట్టం తీసుకువచ్చిందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. బుధవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని మీటింగ్ హాలులో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కొత్త చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జియో సర్వే చేసిన తర్వాతే భూములను రిజిస్ట్రేషన్ చేసే వెసులుబాటు కొత్త చట్టంలో పొందుపర్చారని తెలిపారు. రాబోయే కాలంలో భూధార్ వల్ల రైతులు, ప్లాట్ల యజమానులు నష్టపోయే ప్రమాదం లేదన్నారు. రాష్ట్రంలో భూరికార్డులు సరిగా లేవనే కారణంతో ధరణిని తీసుకువచ్చారని, ఇందులోని లోపాలను సరిచేసే అవకాశం అధికారులకు లేకపోవడంతో బాధితులు కోర్టులకు వెళ్లేవారని గుర్తుచేశారు. ఇక నుంచి ఆసమస్య ఉండబోదని తెలిపారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, అక్కడ పరిష్కారం కాకపోతే ఆర్డీఓలు, అక్కడా పని కాకపోతే కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయొచ్చని వివరించారు. కొత్త చట్టంలో గ్రామ పహానీ, ప్రభుత్వ భూముల రిజిస్టర్, మార్పుల రిజిస్టర్, వనరుల రిజిస్టర్ ఇలా నాలుగు రకాలుగా గ్రామ రికార్డులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, భూదాన్ భూములను సర్వే చేసి అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని స్పష్టంచేశారు. 2025 చట్టం ప్రకారం భూమి కలిగిన రైతుల పేరున ఆర్‌ఓఆర్(రికార్డ్ ఆఫ్ రైట్)లో పేర్లు ఉంటాయన్నారు. 18 రాష్ట్రాల్లోని భూ చట్టాలను పరిశీలించి, పరిశోధించి భూభారతిని తీసుకువచ్చారని వెల్లడించారు. దరఖాస్తు పెట్టుకున్న నెల రోజుల్లో మండల స్థాయిలోనే సమస్య పరిష్కామయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెవెన్యూ శాఖను పటిష్టం చేసి, సిబ్బందిని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వచ్చే నెలలో గ్రామ అధికారులు(వీఆర్‌వోలు), మరో రెండు నెలల్లో సర్వేయర్ల నియామకం ఉంటుందని స్పష్టం చేశారు. పలువురు రైతులు అడిగిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, టీయూఎఫ్‌ఐడీసీ ప్రోగ్రాం చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి, కార్పొరేషన్ కమిషనర్లు పి.సరస్వతి, ఆర్.జ్ఞానేశ్వర్, జల్‌పల్లి కమిషనర్ వెంకట్రామ్ పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు

కలిసి పోరాడితేనే పరిష్కారం

- బీసీ ఉద్యోగుల సంఘం నేతలు
- జిల్లా నూతన కమిటీ ఎన్నిక

షాద్‌నగర్: రాష్ట్రంలో బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా పోరాడాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బీసీ ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఏకతాటిపైకి వచ్చి ప్రమోషన్లలో రిజర్వేషన్ సాధించుకోవాలన్నారు. రాష్ట్రంలో క్రిమిలేయర్ ఎత్తివేయడంతో పాటు ఈడబ్ల్యూఎస్‌ను రద్దు చేసే వరకు ప్రభుత్వంపై పోరాడుతామని స్పష్టంచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాన్ని, ఎదురవుతున్న సమస్యలపై ప్రశ్నిస్తామని తెలిపారు. బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ (అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్), వైస్ ప్రెసిడెంట్‌గా పద్మనళిని (బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం), కార్యదర్శిగా రాఘవేందర్‌గౌడ్(ఐటీఐ కాలేజీ అసిస్టెంట్ ట్రెనింగ్ ఆఫీసర్), మహిళా విభాగం అధ్యక్షురాలిగా శ్వేత(లెక్చరర్), ముఖ్య సలహాదారులుగా బాల్‌రాజ్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమ, రాష్ట్ర కార్యదర్శి మహేంద్రసాగర్, జిల్లా బీసీ ఉద్యోగులు కరుణశ్రీ, శ్వేత, జ్యోతి, నర్సింలుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అఘోరీకి 14 రోజుల రిమాండ్

- చేవెళ్ల కోర్టులో హాజరు పర్చిన పోలీసులు
- లింగ నిర్ధారణ పరీక్షల అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలింపు



నార్సింగి పీఎస్ నుంచి అఘోరీని బయటకు తీసుకొని వస్తున్న మోకిల పోలీసులు

చేవెళ్ల/శంకర్‌పల్లి: అఘోరీ అలియాస్ శ్రీనివాస్‌ను అరెస్టు చేసిన మోకిల పోలీసులు బుధవారం చేవెళ్ల కోర్టులో హాజరుపర్చగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. పూజల పేరుతో అఘోరీ తనను మోసం చేసిందని, చంపుతానని బెదిరించి రూ.9.80 లక్షలు తీసుకుందని శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూర్ శివారులోని ప్రగతి రిసార్ట్స్‌లో నివాసముండే ఓ మహిళా సినీ నిర్మాత ఈఏడాది ఫిబ్రవరి 25న మోకిల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బీఎన్‌ఎస్ 308(5),318(1),351(3),352 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, గత మంగళవారం ఉత్తర్‌ప్రదేశ్‌లో అఘోరీని అరెస్టు చేసి, తీసుకువచ్చారు. నార్సింగి ఏసీపీ కార్యాలయం నుంచి బుధవారం పోలీస్ వాహనంలో చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, సాధారణ వైద్య పరీక్షలు చేయించి, చేవెళ్ల జూనియర్ ఫస్ట్‌క్లాస్ జడ్జి ధీరజ్‌కుమార్ ఎదుట హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు.

రిమాండ్ సమయంలో హైడ్రామా

న్యాయమూర్తి ఆదేశాల మేరకు మోకిల పోలీసులు అఘోరీని సంగారెడ్డి జిల్లా కంది జైలు అధికారులకు అప్పగించి వెళ్లారు. అయితే అఘోరీని ఏ బ్యారక్‌లో ఉంచాలనే సందేహం రావడంతో, వారు మళ్లీ మోకిల పోలీసులను పిలిపించారు. దీంతో అఘోరీని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి లింగ నిర్ధారణ పరీక్షలు చేయించారు. మహిళ అని గుర్తించిన తర్వాత చంచల్‌గూడ జైలుకు తరలించారు. అరెస్టు సమయంలో అఘోరీ నుంచి రూ. 5,500 నగదు, నేరాలకు ఉపయోగించిన ఐ20 కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సులభంగా డబ్బు కోసమే..

తనను తాను అఘోరీ మాతగా ప్రకటించుకుని రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన శ్రీనివాస్(28) చిన్ననాటి నుంచి అబ్బాయిగానే ఉన్నాడు. ఆతర్వాత సులభంగా డబ్బు సంపాదించడంతో పాటు ఇతర కారణాలతో చెన్నై, ఇండోర్‌లో లింగ మార్పిడి శస్త్ర చికిత్సలు చేయించుకున్నాడు. అనంతరం ఆధ్యాత్మిక వేషధారణలో కనిపిస్తూ, తంత్ర పూజలు అంటూ అమాయకులను మోసం చేస్తూ ఆర్థికంగా లబ్ధి పొందుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

పోలీసులు, కోర్టులకు సహకరిస్తా..

చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని పోలీసులు, కోర్టులకు పూర్తిగా సహకరిస్తానని అఘోరీ తెలిపారు. జడ్జి ముందు హాజరైన సమయంలో తనకు లాయర్‌ను పెట్టుకునే స్తోమత లేదని, ప్రభుత్వ అడ్వకేట్‌ను ఏర్పాటు చేయాలని అఘోరీ కోరినట్లు తెలిసింది. అరెస్ట్, కస్టడీ నేపథ్యంలో కోర్టులో ఎలాంటి వాదనలు జరగలేదని సమాచారం. అఘోరీ అభ్యర్థన మేరకు న్యాయమూర్తి ఈ కేసును లీగలేయర్ కౌన్సిల్‌కు అప్పగించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలుసుకుని కేసును ముందుకు తీసుకెళ్తానని ఆయన తెలిపారు.

హోమ్‌కు శ్రీవర్షిణి..

అఘోరీతో పాటు శ్రీవర్షిణిని అదుపులోకి తీసుకున్న పోలీసులు మోకిల పీఎస్‌లో ఆమెకు కౌన్సెలింగ్ ఇప్పించారు. అనంతరం నగరంలోని హైదర్షాకోట్ కస్తూర్బాగాంధీ వెల్ఫేర్ హోమ్‌కు తరలించారు.

భారతి సిమెంట్‌కు తిరుగులేదు

సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహ్మద్ సాహిర్


మేస్త్రీలకు బీమా బాండ్లు అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

మహేశ్వరం: వ్యాపారంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో.. ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను విడుదల చేసిందని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహ్మద్ సాహిర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో శ్రీరామ స్టీల్ ట్రేడర్స్ డీలర్ షాపులో తాపీమేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మార్కెట్లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు ఈ సిమెంట్ సరైన ఎంపికని చెప్పారు. స్లాబ్ నిర్మాణ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడుతారని తెలిపారు. డీలర్ నర్సింహ మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందన్నారు. ఇతర సిమెంట్‌లతో పోలిస్తే ఇది చాలా బెటర్ అన్నారు. అంతకు ముందు తాపీమేస్త్రీలకు భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ ఉపయోగాలపై అవగాహన కల్పించారు. రూ.లక్ష ప్రమాద బీమా బాండ్లను పంపిణీ చేశారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి

డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు

కేశంపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు సిబ్బందికి సూచించారు. మండల పీహెచ్‌సీని ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులతో పాటు పరిసరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... టీకాల కార్యక్రమం సకాలంలో జరిగే విధంగా చూడాలన్నారు. డ్రాప్ అవుట్లు, లెఫ్ట్ అవుట్లను గుర్తించి వెంటనే టీకాలను వేయాలని చెప్పారు. ఆరోగ్య కార్యక్రమాలను మెరుగుపర్చుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో పరిశుభ్రతపైన ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సిబ్బంది రోగుల ఆరోగ్యం కోసం నిబద్ధతతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నిఖిత, సిబ్బంది ఉపేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మెరిక్లిన్, సంగీత, చంద్రశేఖర్, హనుమంతు, సుజాత, సుమతి, వసంత, గీత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పనులు కావాలంటే..
అక్కడికి వెళ్లాల్సిందే!

జిల్లాల పునర్విభజనలో భాగంగా వికారాబాద్ జిల్లా ఏర్పడింది. అందులో పరిపాలన సౌలభ్యం దృష్ట్యా నూతనంగా మండలాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కోవలోకి చెందిందే దుద్యాల్. మండలం ఏర్పాటై మూడేళ్లు గడుస్తున్నా ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాల సేవలు మాత్రం పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు.

- దుద్యాల్‌లో ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్లలో పలు సర్వీసులు కరువు
- పాత మండలానికి రెఫర్ చేస్తున్న అధికారులు
- తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్న స్థానికులు


పాత గ్రామ పంచాయతీలోనే కొనసాగుతున్న ఎంపీడీఓ కార్యాలయం

దుద్యాల్: నూతనంగా ఏర్పడిన దుద్యాల్ మండలంలో ప్రభుత్వ సర్వీసులు అంతంత మాత్రంగానే కనిపిస్తున్నాయి. మండలంలో తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్ వంటి ప్రధాన కార్యాలయాలను ప్రభుత్వ పెద్దటు ఆర్భాటంగా ప్రారంభించారు. అయితే ఒక్క తహసీల్దార్ కార్యాలయంలో మాత్రమే అన్ని కార్యకలాపాలు, అందుకు సంబంధించి అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయి. పోలీస్‌స్టేషన్ ఏర్పాటై దాదాపు నాలుగు నెలలు గడుస్తున్నా కేసుల నమోదు, ఇతర సర్వీసులు ఊసే లేదు. రెండు నెలల క్రితం ఏర్పాటైన ఎంపీడీఓ కార్యాలయంలో కూడా సేవలు అందుబాటులోకి రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని మండలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా పనుంటే బొంరాస్‌పేట్, కొడంగల్, దౌల్తాబాద్ కేంద్రాలకు వెళ్లమని చెబుతున్నారని పేర్కొంటున్నారు.

లాగిన్‌దే అసలు సమస్య!

దుద్యాల్ మండల ఎంపీడీఓ కార్యాలయంలో ప్రస్తుతం పుట్టిన, మరణ ధ్రువీకరణ పత్రాలు, భవన అనుమతులు, ప్రజాపాలన సర్వీసులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఉపాధి హామీ, కార్పొరేషన్, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్ వంటి అనేక రకాల సేవలు లేవని కార్యాలయ సిబ్బంది తెలిపింది. ప్రజలకు అధికంగా ఉపయోగపడే సర్వీసులు అన్ని పాత మండలానికి సంబంధించిన లాగిన్‌లోనే కొనసాగుతున్నాయని అధికారులు తెలుపుతున్నారు. మండలం ఏర్పడి కార్యాలయాలు వచ్చినా సేవలు మాత్రం రాకపోవడంతో మండల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పోలీస్‌స్టేషన్ సర్వీసులు అందుబాటులో లేకపోవడంతో పాత ఠాణాకే కేసులు రెఫర్ చేస్తున్నారు. అలాగే మండలానికి వ్యవసాయ అధికారిని నియమించిన శాఖకు సంబంధించిన ప్రధాన సేవలు అందుబాటులో లేకపోవడం విడ్డూరంగా ఉందని స్థానిక రైతులు పేర్కొంటున్నారు. ఇలా మండలం ఏర్పడిన తర్వాత సైతం పూర్తిస్థాయిలో సర్వీసులు లేకపోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి కార్యాలయాల్లో సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

గాలి వానకు నేలరాలిన మామిడి


తోటలో నేలరాలిన మామిడి కాయలు

కడ్తాల్: మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం కురిసిన ఈదురు గాలులతో కూడిన వానకు మామిడి తోటల్లోని కాయలు నేల రాలాయి. అసలే ఈ ఏడాది అంతంతా మాత్రమే కాసిన మామిడి, అకాల వర్షాలకు నేలరాలడంతో తీవ్రంగా నష్టపోయామని బాధిత రైతులు పేర్కొంటున్నారు. మండల కేంద్రం సమీపంలో బీక్యానాయక్‌కు చెందిన ఆరు ఎకరాల మామిడి తోట గాలి వానకు పూర్తిగా కాయలు నేలరాలడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. సంబంధిత అధికారులు గ్రామాల్లో పర్యటించి, నష్ట పోయిన మామిడి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మేడే వాల్ పోస్టర్ ఆవిష్కరణ


గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

తుర్కయంజాల్: మే 1వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ కార్మిక దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్ కోరారు. బుధవారం తుర్కయంజాల్‌లో మేడే వేడుకల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మాల్యాద్రి, సత్యనారాయణ, శ్రీనివాసులు, కృష్ణ, మాధవరెడ్డి, జంగయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

లారీలో చెలరేగిన మంటలు


దగ్ధమవుతున్న లారీని ఆర్పుతున్న ఫైరింజన్ సిబ్బంది

ఇబ్రహీంపట్నం: అకస్మాత్తుగా ఇంజన్‌లో మంటలు చెలరేగి ఓ లారీ దగ్ధమైన సంఘటన ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఏపీ నుంచి గ్రానేట్ లోడ్‌తో లారీ హైదరాబాద్‌కు వస్తోంది. మార్గమధ్యలో ఇబ్రహీంపట్నం చెరువు కట్టపైకి రాగానే సాంకేతిక లోపంతో ఇంజన్‌లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. డ్రైవర్ చకచక్యంగా లారీ నుంచి దూకి ప్రాణాలను కాపాడుకున్నాడు. మంటలకు లారీ ముందుభాగం పూర్తిగా దగ్ధమైంది. సంఘటనా స్థలానికి వచ్చిన ఫైరింజన్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. కానీ ఈ ఘటనపై ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

టెన్త్ విద్యార్థి ప్రాణం తీసిన అతివేగం

నాంపల్లి: అతివేగం ఒకరి ప్రాణాలను బలితీసుకుంది. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సీతారామ్‌భాగ్ సాయిబాబా హోటల్ సమీపంలో నివాసం ఉండే లింగరాజు దంపతుల కుమారుడు భగవత్(16), సమీపంలో నివాసం ఉండే అతడి స్నేహితులు అరుణ్, పవన్, ఆనంద్ నలుగురు ఓ ద్విచక్రవాహనంపై అతివేగంగా వెళ్తున్నారు. వీరు బోయిగూడ కమాన్ నుంచి హమీద్ కేఫ్ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేశారు. ఈ క్రమంలో ఎదురుగా ఉండే మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టారు. దీంతో బైకుపై వెనుక కూర్చున్న భగవత్ కిందపడిపోయి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. బైక్ నడుపుతున్న అరుణ్‌తో పాటుగా పవన్, ఆనంద్ ప్రాణాపాయం నుండి బయటపడ్డారు. తీవ్ర గాయాల పాలైన ముగ్గురిని ఉస్మానియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతిచెందిన భగవత్ ఇటీవలే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాశారు. పరీక్షల ఫలితాలు రాక మునుపే రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కుమారుడి మరణవార్త విన్న తల్లిదండ్రులు బోరున విలపించారు.

శుభకార్యాల్లో మాజీ ఎమ్మెల్యే సందడి

దోమ: మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకలకు పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి బుధవారం హాజరయ్యారు. నూతన వధువరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎస్‌జీ గార్డెన్‌లో ఇమ్మడి సాయి వర్షిణి, సాయితరుణి నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ అంజిలయ్య పాల్గొన్నారు.

పేదింటి విద్యా కుసుమాలు

నల్లకంచె గురుకులంలో టాపర్లుగా నిలిచిన అక్కాచెల్లెళ్లు


సరయూ


పూజ

ఇబ్రహీంపట్నం: పేద కుటుంబంలో జన్మించిన అక్కాచెల్లెళ్లు ఇంటర్ రెండో సంవత్సరం ఫలితాల్లో సత్తా చాటారు. కష్టాల నుంచి గట్టెక్కాలంటే చదువే ఏకైక మార్గమని వారు విశ్వసించారు. ఒకరు ఎంపీసీ, మరొకరు బైపీసీ గ్రూపుల్లో టాపర్లుగా నిలిచారు. నల్లకంచె గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థులు సరయూ, పూజ చదువుకు పేదరికం అడ్డు కాదని నిరూపించారు. అధ్యాపకులు, తల్లిదండ్రుల మన్ననలు పొందుతున్నారు.

నిరంతరం సాధనతో..

పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్ రాజీవ్ గృహకల్పలో నివాసముండే టి.రమేశ్, సుజాత దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రమేశ్ వనస్థలిపురంలోని ఓ హోటల్‌లో వంట మనిషిగా పనిచేస్తున్నారు. తన కూతుర్లు సరయూ, పూజలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలనుకున్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని నల్లకంచె గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో వారిని చేర్పించారు. విద్యలో రాణిస్తే తమ కష్టాల నుంచి గట్టెక్కుతామని ఆ పిల్లలు భావించారు. అందుకు అనుగుణంగా నిరంతరం సాధన చేసి ఇంటర్ ఎంపీసీలో సరయూ 991/1000, బైపీసీలో పూజ 992/1000 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ విద్యనభ్యసించాలనే ధ్యేయంతో ఇరువురూ ఉన్నారు.

1275 మంది మైనర్ డ్రైవర్ల పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మైనర్ డ్రైవింగ్ నిరోధంపై దృష్టి పెట్టిన ట్రాఫిక్ విభాగం అధికారులు ఈ నెల 5 నుంచి స్పెషల్ డ్రైవ్ చేస్తున్నారు. మంగళవారం వరకు నిర్వహించిన తనిఖీల్లో 1275 మంది మైనర్లు డ్రైవింగ్ చేస్తూ చిక్కారని, వీరిపై కేసులు నమోదు చేశామని ట్రాఫిక్ చీఫ్ జోయల్ డెవిస్ బుధవారం తెలిపారు. వీటిలో 35 వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్‌ను ఏడాది పాటు రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మైనర్లతో పాటు ఆయా వాహనాల యజమానుల పైనా కేసులు నమోదు చేశారు. ఈ వివరాలను ఆర్టీఏ అధికారులకు పంపగా... బుధవారం నాటికి 35 వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు కాగా..మిగిలిన వాటిపీ రద్దు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ నేపథ్యంలో పోలీసులు మోటారు వాహనాల చట్టంలోని 199 (ఎ) సెక్షన్‌ను వినియోగిస్తున్నారు. ఈ సెక్షన్ ప్రకారం వాహనం నడుపుతూ చిక్కిన మైనర్‌కు జరిమానాతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఆ వాహనం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ) ఏడాది పాటు సస్పెండ్ అవుతుంది. సాధారణంగా 18 ఏళ్లు నిండిన వ్యక్తి మొదట లెర్నింగ్ లైసెన్స్, ఆపై శాశ్వత లైసెన్స్ తీసుకోవచ్చు. అయితే డ్రైవింగ్ చేస్తూ చిక్కిన మైనర్‌కు మాత్రం 25 ఏళ్ల నిండే వరకు ఈ రెండింటిలో ఏదీ తీసుకోవడానికి అవకాశం ఉండదు. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఎవ్వరూ మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని జోయల్ డెవిస్ కోరుతున్నారు. ప్రజలు ట్రాఫిక్ పోలీసులకు సహకరిస్తూ రోడ్డు ప్రమాదాలు, అందులో మృతుల్ని తగ్గించడంలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు.

డాక్టర్ విజయ ఆనంద్‌రెడ్డిపై కేసు కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ ఆంకాలజిస్ట్, అపోలో ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ విజయ ఆనంద్‌రెడ్డిపై సుదీర్ఘ కాలంగా ఉన్న కేసును సరైన ఆధారాలు లేవంటూ హైకోర్టు కొట్టివేసింది. వైద్యంలో నిర్లక్ష్యం కారణంగానే రోగి మృతిచెందినట్లు నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని పేర్కొంది. 2009లో తన తల్లి మరణానికి వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని పేర్కొంటూ నాలుగేళ్ల తర్వాత 2013లో ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు డాక్టర్ విజయ ఆనంద్‌రెడ్డిని ఏ-2గా చేర్చారు. ఈ కేసుకు తనకు ఎలాంటి సంబంధం లేదంటూ డాక్టర్ విజయ ఆనంద్‌రెడ్డి ట్రయల్ కోర్టులో డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. నిందితుల జాబితా నుంచి తనను తొలగిస్తూ ఆదేశాలు జారీ చేయాలని కోరారు. విచారణ చేపట్టిన ట్రయల్‌కోర్టు డిశ్చార్జ్ పిటిషన్‌ను కొట్టివేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఈవీ వేణుగోపాల్ విచారణ చేపట్టారు.

ట్రాక్టర్ టైర్ కింద పడి డ్రైవర్ మృతి

షాబాద్: ట్రాక్టర్ టైర్ కింద పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన రుద్రారం వద్ద బుధవారం చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ గ్రామానికి చెందిన ఎం.రాజు(30) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. హైతాబాద్ నుంచి ట్రాక్టర్‌పై నాగర్‌గూడ వెళ్తుండగా మార్గమధ్యలో రుద్రారం వద్ద ముందు వీల్ విరిగిపోయింది. దీంతో రాజు సడన్‌బ్రేక్ వేసి ట్రాక్టర్‌పై నుంచి దూకే క్రమంలో టైర్ కింద పడి మృతి చెందాడు. మృతుడి భార్య బాలమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దాయాదిపై కత్తితో దాడి

మాడ్గుల్: భూ వ్యవహారంలో తలెత్తిన వివాదంతో దాయాదులు దాడికి తెగబడ్డారు. ఈ సంఘటన మండల పరిధిలోని ఇర్విన్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోరెటి యాదయ్యకు దాయాదులతో భూ వ్యవహారంలో కొన్నేళ్లుగా వివాదాలున్నాయి. బుధవారం పొలం వద్ద యాదయ్య అతని కుమారుడు కిరణ్ తాటి ముంజలు కోసుకుండగా... దాయాదులైన వంశీ, జంగయ్య, యాదగిరి అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తడంతో వంశీ కత్తితో యాదయ్యపై దాడి చేశాడు. అడ్డుకున్న కిరణ్‌ను సైతం తీవ్రంగా కొట్టాడు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భూ భారతితో పారదర్శక లావాదేవీలు

సాక్షి, సిటీబ్యూరో: పారదర్శకమైన, సమర్థవంతమైన భూ లావాదేవీల నిర్వహణకు భూ భారతి నిలుస్తుందని నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) అభిప్రాయపడింది. భూ భారతితో పాటుగా రాష్ట్రంలో భవన నిర్మాణ అనుమతులను క్రమబద్ధీకరించేందుకు బిల్డ్ నౌ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడం పట్ల నరెడ్కో హర్షం వ్యక్తం చేసింది. బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో నరెడ్కో విజయ సాయి మేకా మాట్లాడుతూ.. మిస్సింగ్ సర్వే నంబర్లు, లే అవుట్లను ఓపెన్ ల్యాండ్స్‌గా చూపెట్టడం, నిషేధిత జాబితాలో సర్వే నంబర్లను తప్పుగా జాబితా చేయడం వంటి మరెన్నో సమస్యలను పోర్టల్ పరిష్కరించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న పాట్లి మహరాజ్ ఆలయ కమిటీ సభ్యులు

తాండూరు: ఆలయాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పాట్లి మహరాజ్, సీతారాంపేట్ ఆంజనేయ స్వామి ఆలయాల నూతన పాలకమండలి సభ్యులు ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. పాట్లి మహరాజ్ ఆలయ చైర్మన్‌గా ప్రసాద్‌గౌడ్, సభ్యులుగా నవీన్‌గౌడ్, జగన్నాథ్, సిద్దమ్మ, శ్రీనివాస్, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా అనంత్ భట్, సీతారాంపేట్ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా భీమలింగం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు.

అక్రమంగా నివాసం ఉంటున్న
ఇద్దరు బంగ్లాదేశీయుల అరెస్టు

- వీరికి సహకరించిన నలుగురు ఏజెంట్లు
- నకిలీ పత్రాలు, ల్యాప్‌టాప్, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం

మలక్‌పేట: చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా అక్రమంగా భారతదేశంలోకి ప్రవేశించి..నకిలీ పత్రాలతో నగరంలో నివాసం ఉంటున్న బంగ్లాదేశ్ జాతీయులను పోలీసులు పట్టుకున్నారు. వీరికి సహకరించి..నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు, ఇతర సర్టిఫికెట్లు అందజేసిన నలుగురు ఫెసిలిటేటర్స్(ఏజెంట్లు)ను అదుపులోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం..మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సలీంనగర్ కాలనీలో కొందరు బంగ్లాదేశీయులు అక్రమంగా నివసిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం మలక్‌పేట పోలీసులు, సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారు ఉంటున్న ఇంటిపై దాడి చేశారు. దాడిలో ఢాకా పరిధిలోని మార్పూర్ గ్రామానికి చెందిన మహ్మద్ హసిబుల్ (25), జోస్సోర్ జిల్లా బెనాపోల్ గ్రామం నబరోస్ ప్రాంతానికి చెందిన రోహన్ సాహా(21) అలియాస్ రోహన్‌లను మొదట అరెస్టు చేశారు. అనంతరం వీరికి నకిలీ ధృవపత్రాలు అందించడంలో సహకారం అందించిన నల్లగొండ క్రాస్‌రోడ్‌లోని పాన్‌షాప్ నిర్వాహకుడు, అక్బర్‌బాగ్‌కు చెందిన మహమ్మద్ ముఖీద్, కాలడేరా ఉప్పలమ్మ టెంపుల్ ప్రాంతానికి చెందిన డీటీపీ ఆపరేటర్ టి.సాయికిరణ్, చంచల్‌గూడకు చెందిన బ్రోకర్ గడ్డమీది రజనీకాంత్, నార్సింగ్ మున్సిపాలిటీ శానిటేషన్ సెక్షన్‌లో అవుట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్ దుడ్డు సుధీర్‌కుమార్‌లను కూడా పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి బంగ్లాదేశ్ పాస్‌పోర్ట్ కాపీ, నకిలీ ఆధార్ కార్డులు, నకిలీ జనన ధృవీకరణ పత్రాలు, ఓటర్ కార్డు, ఏడు సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌ట్యాప్ స్వాధీనం చేసుకున్నారు.

పేరు మార్చుకుని..నకిలీ ఆధార్ పొంది..

ఇదిలా ఉండగా.. నిందితుడు మహమ్మద్ హసిబుల్ బంగ్లాదేశ్ పాస్‌పోర్ట్ (నంబర్ బీబీ0921146) కలిగి ఉన్నాడు. నాలుగేళ్ల క్రితం బంగ్లాదేశ్‌లోని బెనాపోల్ జిల్లా నుంచి సరిహద్దు బ్రోకర్ల ద్వారా పశ్చిమ బెంగాల్‌లోని బింగావ్ జిల్లాలోకి ప్రవేశించాడు. ఆ తర్వాత కోల్‌కత్తాకు చేరుకుని అక్కడి సాత్‌హౌరాలో కరాటే ట్రైనర్‌గా పని చేశాడు. కొన్నాళ్లకు అతని పేరును జోవాన్ చౌదరి అని మార్చుకుని 864359370139 నంబర్‌తో నకిలీ ఆధార్‌కార్డు పొందాడు. 2023 డిసెంబర్ నెలలో ఫేస్‌బుక్ చాటింగ్ ద్వారా అతనికి జయ చౌదరి అనే మహిళతో స్నేహం ఏర్పడింది. అతని నిజమైన గుర్తింపును దాచి మోసపూరితంగా ఆమెను వివాహం చేసుకున్నాడు. తర్వాత మలక్‌పేటకు మకాం మార్చాడు. ఆన్‌లైన్ గార్మెంట్స్ సేల్స్ వ్యాపారం చేస్తున్నారు. జొమాటో, స్విగ్గీ ఫుడ్ డెలివరీ ఏజెంట్‌గా కూడా పని చేస్తున్నాడు. ఎనిమిది నెలల క్రితం నార్సింగ్ మున్సిపాలిటీ నుంచి నకిలీ బర్త్ సర్టిఫికెట్ కూడా పొందాడు.

కొద్ది రోజుల తర్వాత రోహన్ సాహా అనే బంగ్లాదేశ్ పౌరుడితో స్నేహం చేశాడు. కోల్‌కత్తాలో టూరిస్ట్ గైడ్‌గా అక్రమంగా ఉంటున్న అతన్ని, గర్భవతి అయిన అతని భార్యను తీసుకుని ఈ ఏడాది మార్చిలో మలక్‌పేటకు తీసుకు వచ్చి వారికి ఆశ్రయం కల్పించాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ గజం 2499/- రూ.కే విజయవాడ హైవే నార్కట్‌పల్లి దగ్గర అద్భుతమైన ఫామ్ ల్యాండ్ వెంచర్‌లో 1210 గజాల ప్లాట్లు కలవు. సంప్ర :96666 95886 [HA-1318]

■ Shamshabad Airport near 2 BHK 39 & 29 Lakhs. Gajwel from 35km 60 Sqyads 2 Lakhs 1acar 60 & 1Cr 50 Lakhs. 7893429779 [SCA25002874]

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ 9100329739 [H-800530]

BUSINESS OFFER

■ ITR/Salary Slip లేకుండా 48గంటల్లో హోంలోన్ పొందడం కష్టం కాదు- Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి:7406393937 [HA-453]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Pattan Pyari W/o Shabbir Ahmed Khan R/o 3-94/C/18 Gandimaisamma Dommara Pochampally Gandimaisamma-Dundigal Mandal Medchal-Malkajgiri District Telangana. I have changed my name from Pattan Pyari to Mumtaz Begum Khan for all purpose [SCA25002924]

■ I, SARASWATHI ANUMAGANDLA H.No:-6-3-788/12, Sri Ganesh Nagar, Ameerpet, Hyderabad, Telangana-500016. Changed my Name from SARASWATHI MASUNA to SARASWATHI ANUMAGANDLA [SCA25002929]

■ I, Ambati Ramalakshmamma W/o Ambati Venkata Reddy Residing at 505, Sai Teja Enclave, Kukatpally Hyderabad, Telangana 500072,have changed the name to Ambati Ramalakshmi vide Affadavit Dated 16-04-2025 at Hyderabad [WB-2949]

■ I, Shreya Goutam D/o, Sanjay Singh R/o Flot No. 401 Maruthi Heights, New Maruthi Nagar, Kothapet, Vtc: Saroornagar, District: Rangareddi, State: Andhra Pradesh, Pin Code: 500035, have changed my name to Shreya Gautam. [HA-42671]

OLD AGE HOME

■ వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచానున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్ చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతితో. 7981467036, 9391039990, 9949520296 [H-783373]

TOURS & TRAVELS

■ సాయిటూర్స్ - ఏప్రిల్ 29 కర్ణాటక. ఉడిపి గోకర్ణ శృంగేరి దర్శనల. మే 7 గుజరాత్ ద్వారక, ఉజ్జయిని మే 17 రామేశ్వరం, కన్యాకుమారి. జూన్ 2 కాశీ 9 నిద్రలు. 9848664831 [HA-1320]

Wanted

■ హాస్పిటల్ క్యాంటీన్‌లో పనిచేయుటకు బాయ్స్ & గర్ల్స్ కావలెను. ఉచిత వసతి భోజనం. స్వప్న హెల్త్ కేర్ క్యాంటీన్, బేగంపేట్. Ph: 9247192984 [SCA25002933]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టెలి కాలర్స్, డోర్ 2 డోర్ యువతీ / యువకులు కావలెను. జీతం : 25K. 9948208005 [SCA25002931]

■ Hyd-రియల్ ఎస్టేట్Co.కై మార్కెటింగ్ Exe. కావలెను.కోకాపేట, శంకరపల్లిలో విల్లాస్/ ప్లాట్స్ సేల్స్‌కై జీ+కమీ+ 2వీలర్+ రూం+ భో. ఫ్రీ. Age: 34,నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781 [HA-15035]

■ RTC X రోడ్స్ గాంధీనగర్ బాయ్స్ హాస్టల్లో వంటమాస్టర్లు (భార్య భర్తలు) హౌస్ కీపింగ్ (భార్య భర్తలు) కావలెను. వసతి, భోజనం ఫ్రీ+జీతం: Ph: 9949338350 [SCA25002901]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో Hyderabadలో మార్కెటింగ్ చేయుటకు మార్కెటింగ్ ట్రైనీస్, టీం లీడర్స్ పార్ట్ టైం ఫుల్ టైం (జీతం+కమీషన్ +వసతి) కావలెను. Ph: 7337399968, 8121020116 [HA-403]

■ పావని చికెన్ చేపలు & మటన్ సెంటర్ హయత్‌నగర్‌లో పనిచేయుటకు అనుభవం గల ముస్లిం కటింగ్ మాస్టర్స్ కావలెను. జీతం: 13000. ఫుడ్ వసతి. 8247522969 [SCA25002880]

■ నర్మద హోండా షోరూం షాద్‌నగర్‌లో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సర్వీస్ మేనేజర్, ఫ్లోర్ సూపర్ వైజర్స్, స్పేర్ పార్ట్స్ ఇంచార్జెస్ కావలెను. సంప్ర॥ సెల్ : 9492926060. [J-532]

■ చందానగర్‌లో గల గోల్డ్ షాప్‌లో పనిచేయుటకు హౌస్‌కీపింగ్ లేడీస్ కావలెను. ఆర్జెంట్‌గా సంప్రదించండి: 9390596974 [HA-15146]

■ Vocational Junior College in Chandrayangutta seeks Vice Principal & Lecturers (All Subjects) for MLT, MPHW, PT, CSE, A&T. Part-time / Full-time can apply Email: jobsatsrichandra@gmail.com Call or WhatsApp: 9666156313. [HA-34326]

■ Senior Lecturers for Maths, Economics, Civics, Arabic, Computers. JLs for Physics, Maths & Chemistry (Freshers can apply). Part-time / Full-time can apply Email: jobsatsrichandra@gmail.com Call or WhatsApp: 9666156313 [HA-34327]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు) ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక : ఇక్కడ మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహిదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453